సాక్షి అనకాపల్లి

శనివారం । 27 । మే । 2023



దరఖాస్తుల వెల్లువ

టీచర్ల బదిలీలకు 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుకు అవకాశమిచ్చారు. 10లో



గెలిచేది మత్స్యకారుడే

మత్స్యకారులను అవహేళన చేసిన చంద్రబాబును కుప్పంలో ఆ వర్గం వారే ఓడిస్తారని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. 10లో

స్వల్ప వర్షసూచన



అనకాపల్లి టౌన్: రాగల అయిదురోజుల్లో మూడురోజులు స్వల్ప వర్ష సూచన ఉందని ఆర్ ఎ ఆర్ ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. 29న 4 మి.మీ, 30న 6, 31న 8 మి.మీ. వర్షపాతం నమోదవుతుందని, మిగతా రెండురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 72 చెరువుల అభివృద్ధి

మాకవరపాలెం: జిల్లాలో 72 చెరువులను అభివృద్ధి చేస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి తెలిపారు. మండలంలోని కొండల అగ్రహారంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త లేకుండా వీధులు శుభ్రంగా ఉండేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఈ గ్రామంలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిన ఎరుకన్న చెరువును పరిశీలించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు 100 చెరువులను సుందరీకరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం 72 చెరువులను ఎంపిక చేశామని, మాకవరపాలెం మండలంలోని బయ్యవరం, గిడుతూరు, దాలింపేట, కొండలఅగ్రహారంలో ఒక్కో చెరువును ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. చెరువు గట్లపై మొక్కలు వేయడంతోపాటు విశ్రాంతి తీసుకునేందుకు బెంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వాకింగ్ చేసేందుకు ట్రాక్‌లను కూడా వేస్తామని తెలిపారు. ఆమె వెంట నర్సీపట్నం డీఎల్పీవో సత్యనారాయణ ఉన్నారు.

విక్రయానికి సిద్ధంగా జీడి, మామిడి మొక్కలు

మాడుగుల రూరల్: అనకాపల్లి ఉద్యానవన క్షేత్రంలో జీడిమామిడి, మామిడి, నిమ్మ, మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి.ప్రభాకర్‌రావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జీడిమామిడి మొక్క రూ.60, కొబ్బరి మొక్క రూ.90, నిమ్మ మొక్క రూ.25లకు విక్రయించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు నేరుగా అనకాపల్లిలో గల ఉద్యానవన క్షేత్రానికి వచ్చి నగదు చెల్లించి మొక్కలు పొందవచ్చునని పేర్కొన్నారు. లక్ష జీడిమామిడి మొక్కలు అంట్లు కట్టడం జరిగిందని, ఈ ఏడాది ఆగస్టు మాసంలో ఈ మొక్కలను విక్రయిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కె.జె.పురం చిన్నోడికి తెలంగాణ ఎంసెట్‌లో 17వ ర్యాంకు



కాళ్ల లక్ష్మీ సూర్య

మాడుగుల రూరల్: తెలంగాణ ఎంసెట్‌లో కె.జె.పురం గ్రామానికి చెందిన కాళ్ల లక్ష్మీ సూర్య 17వ ర్యాంకు సాధించాడు. ఈ చదువుల తల్లి ముద్దు బిడ్డ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. లక్ష్మీ సూర్యది రైతు కుటుంబం. తల్లిదండ్రులు కాళ్ల చిన అప్పలనాయుడు, ఉదయశ్రీ. గుంటూరు భాష్యం కళాశాలలో ఇంటర్ చదివాడు. ముంబాయి లేదా చెన్నై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేస్తానని ఈ సందర్భంగా లక్ష్మీ సూర్య తెలిపాడు.

30న యూపీఎస్సీపై అవగాహన సదస్సు

దాబాగార్డెన్స్ (విశాఖ): యూపీఎస్సీ, సివిల్ సర్వీస్ పరీక్షలపై అవగాహనను యువత సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు పోస్టర్ అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి బి.గంగారావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యువత సివిల్స్‌పై అపోహలు వీడి ముందుకు సాగాలన్నారు.

యువతకు మేలు చేసే కార్యక్రమాలకు తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న యూపీఎస్సీ సెమినార్‌లో విద్యార్థులు పాల్గొని పరీక్షల విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో పాల్గొనే వారు పేర్లు నమోదుకు 9315014015కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

29 నుంచి రాత్రి 7 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 2వతేదీ వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఏఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయంలో జరిగే నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఈ మార్పు చేసినట్టు తెలిపారు. అలాగే జూన్ 3న శ్రీనృసింహ జయంతిని ఆలయంలో వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటల తర్వాత స్వామికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ఆరోజు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7గంటల వరకు దర్శనాలు లభించవని, రాత్రి 7గంటల నుంచి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. భక్తులంతా ఈవిషయాలను గమనించాలని కోరారు.

● వేలిముద్ర పడలేదన్న బెంగ లేదిక..

ఐరిస్‌తో రేషన్

'నాకు రేషన్ కార్డు ఉంది. రోజూ కూలీ పనులకు వెళ్లడం వల్ల నా చేతి వేలిముద్రలు అరిగిపోయాయి. ఈ కారణంగా ప్రతి నెల రేషన్ తీసుకునేటప్పుడు వేలిముద్రలు పడక చాలా ఇబ్బంది పడుతున్నాను.. ఏదైనా దారి చూపండి..'

'నా వయస్సు 65 ఏళ్లు. వయస్సు పైబడడం వల్ల అరచేతులు అరిగిపోయి రేషన్ తీసుకునే సమయంలో బయోమెట్రిక్ సమస్యగా మారింది. చేతులు శుభ్రంగా కడిగి.. ఆరబెట్టి ఉంచితే అతి కష్టం మీద వేలిముద్రలు పడతాయి. ఆ కారణంగా ఒక్కో నెల రేషన్ అందడం లేదు. ఏదైనా పరిష్కారం చూపించండి'

'పనులు చేసి చేసి నా వేలిముద్రలు అరిగిపోయాయి సర్.. ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లినా మార్పులు జరగడం లేదన్నారు. రేషన్ సరకులు తీసుకోలేకపోతున్నాను. చాలా ఇబ్బందిగా ఉంది.'

- ప్రతి సోమవారం స్పందనలో పదే పదే వస్తున్న అర్జీలివి..

వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య ప్రజలకు ఎదురవుతున్న కష్టాలపై దృష్టి సారించి, పరిష్కార మార్గాల్ని అన్వేషించి.. వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా రేషన్ కార్డుదారుల ఇబ్బందులకు చెక్ చెప్పేలా ఐరిస్ ద్వారా సరకుల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- వేలిముద్రలు పడక సరకులు పొందలేకపోతున్న వారికి ఊరట
- జిల్లాలో 374 ఎండీయూ వాహనాలకు ఐరిస్ పరికరాలు
- వచ్చే నెల నుంచి కొత్త విధానం అమలు

సాక్షి, అనకాపల్లి: రేషన్ పంపిణీ విధానంలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ (వేలి ముద్రలు) ఆధారంగా రేషన్ పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయాన్ని తీసుకొంది. లబ్ధిదారులకు ప్రతి నెలా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న సమయంలో పలు చోట్ల వేలిముద్రల సమస్య ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతోంది. ఇంటి పనులు చేసినవాళ్లు, కూలి పనులకు వెళ్లే వాళ్లు, వృద్ధులు.. ఇలా చాలామందికి వేలి ముద్రల్లో రేఖలు అరిగిపోయాయి. ఆధార్ కార్డు అప్‌డేషన్‌కు వెళ్లే సమయంలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో రేషన్ తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా జిల్లాలో వందలాదిమంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

మండలం	ఐరిస్ పరికరాలు		
నర్సీపట్నం	18	చీడికాడ	11
నాతవరం	15	చోడవరం	18
మాకవరపాలెం	14	రోలుగుంట	11
గొలుగొండ	13	బుచ్చెయ్యపేట	14
పాయకరావుపేట	20	రావికమతం	15
కోటవురట్ల	14	అనకాపల్లి	38
ఎస్.రాయవరం	16	కశింకోట	15
నక్కపల్లి	18	యలమంచిలి	15
మాడుగుల	16	రాంబిల్లి	12
కె.కోటపాడు	13	మునగపాక	12
దేవరాపల్లి	12	అచ్యుతాపురం	16
		సబ్బవరం	14
		పరవాడ	14

374 ఐరిస్ పరికరాలు

బయోమెట్రిక్ వల్ల లబ్ధిదారులు రేషన్ తీసుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటివరకు సరకుల పంపిణీలో ఉన్న బయోమెట్రిక్ విధానంతోపాటు ఐరిస్ (కంటి గుర్తింపు) విధానం కూడా అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే పౌరసరఫరాల శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల నుంచి ఈ రెండు విధానాల్లో రేషన్ పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించిన ఐరిస్ పరికరాలను జిల్లా పౌర సరఫరాల అధికార యంత్రాంగం అందుబాటులోకి తీసుకొస్తోంది. వీటిని జిల్లాలో ఉన్న 374మంది మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) ఆపరేటర్లకు అందజేయనున్నారు. తొలుత ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల ఐరిస్ సేకరించి, పరికరంలో ఫీడ్ చేస్తారు. వేలిముద్రలు పడకపోతే ఐరిస్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని రేషన్ పంపిణీ చేస్తారు.



ఐరిస్ పరికరాలు

ఈపోస్‌తోపాటు.. ఐరిస్



జిల్లాలో మొత్తం 5,41,818 రైస్ కార్డులు ఉన్నాయి. బయోమెట్రిక్ విధానంతో జిల్లాలో కొంతమంది పేదలు నిత్యావసర సరకులు తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల నుంచి వేలిముద్రలతోపాటు ఐరిస్ మిషన్లతో కంటిని పరీక్షించి సరకులు పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిత్యావసర వస్తువులు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఐరిస్‌తో వేలిముద్రల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఐరిస్ డివైస్‌ల పంపిణీ ఈనెలాఖరులోగా పూర్తి చేస్తాం.

– ఎస్.సుబ్బరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి

మొక్కల పెంపకంలో భాగస్వాములు కండి



పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- పారిశ్రామిక సంస్థలకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపు
- 6న పర్యావరణ దినోత్సవం నుంచి స్పెషల్ డ్రైవ్
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి

తుమ్మపాల: మొక్కల పెంపకంలో పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యం ఉండాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక (డీఐఈపీసీ) కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవమైన జూన్ 6వ తేదీ నుంచి జరిగే మొక్కల పెంపకం కార్యక్రమంలో పారిశ్రామిక సంస్థలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పరిశ్రమలు కీలకమని, అదేవిధంగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. పరిశ్రమల స్థాయిని బట్టి 500 నుంచి 2000 వరకు మొక్కలు నాటాలన్నారు. ఎన్టీపీసీ, బార్క్ సంస్థలు చెరో పదివేల మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. జూలై 31 వరకు జరిగే ఈ కార్యక్రమంలో చెరువులు, నదులు, రోడ్లు, రైల్వేలైన్లు వంటి ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో సమస్యలను తమ వద్దకు తీసుకువస్తే తప్పనిసరిగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. లైసెన్సుల ప్రక్రియను ఆన్‌లైన్ చేసినందున వేగవంతం చేయగలిగామని ఆయన చెప్పారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి.శ్రీధర్ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ పలు సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఆర్వో పి.వెంకటరమణ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, ఏపీఐఐసీ అధికారి జడ్డం త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఆర్డీవో చిన్నికృష్ణ వీర్రాజు, డీపీవో శిరీషరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 'బిచ్చగాడు' సందడి



ప్రేక్షకులకు హీరో విజయ్ ఆంటోనీ అభివాదం

పాట పాడి ఆకట్టుకున్న హీరో విజయ్ ఆంటోనీ

అనకాపల్లి టౌన్: 'బిచ్చగాడు-2 ' చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఆదరించారని హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. స్థానిక రామచంద్ర థియేటర్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. 'బిచ్చగాడు-3' చిత్రాన్ని కూడా మరో రెండేళ్లలో విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సినిమా రాష్ట్రవ్యాప్తంగా 52 థియేటర్లలో దిగ్విజయంగా ప్రదర్శితమవుతోందన్నారు. ఇప్పటి వరకు రూ.15 కోట్లు వసూలు చేసిందని, రూ.30 కోట్లు వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. సంగీత దర్శకుడు కూడా అయిన విజయ్ ఆంటోనీ ఈ సందర్భంగా చిత్రంలో పాట పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాసరావు, థియేటర్ యాజమాన్యం పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం



డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శనరెడ్డికి స్వాగతం పలుకుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

విశాఖ లీగల్: విశాఖలో శనివారం జరగనున్న మూడు జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశానికి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శనరెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన కడప నుంచి నగరానికి చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్టులో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీశ్వర్‌రావు, 11వ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ ఘనంగా స్వాగతం పలికారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌తోపాటు, హైకోర్టు పీపీ వై.నాగిరెడ్డి, అదనపు పీపీ ఎస్.దుష్యంత్‌రెడ్డి కూడా నగరానికి చేరుకున్నారు. వీరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తీరు, వివిధ కేసుల విచారణ, పెండింగ్ కేసులు, పీపీల సమస్యలపై చర్చిస్తారు. తొలిసారిగా న్యాయవాద వృత్తి నుంచి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమితులైన సుదర్శనరెడ్డికి పలువురు సీనియర్ న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మహారాణిపేట (విశాఖ): వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని విశాఖ కలెక్టర్ మల్లికార్జున కోరారు. శుక్రవారం ఉదయం ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్ కేసులను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2015-20, 2020-23 కింద 57 క్లెయిములకు రూ.4.21 కోట్లు మంజూరు చేశామన్నారు. పీఎంఈజీపీ పథకం కింద పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి బ్యాంకర్లు రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ పనులను సత్వరం ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆటోనగర్‌లోని పరిశ్రమలకు మంచినీటి పనులను వారంలోగా పూర్తి చేయాలన్నారు.

మధురవాడ ఐటీ పార్కుకు ఐలా స్టేటస్ మంజూరైందన్నారు. అగనంపూడి ఇండస్ట్రియల్ పార్కుకు అదనంగా 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థాపించామన్నారు.

మారుమూలాలకు వెళ్లం..!

- విశాఖను వదలని అయ్యవార్లు
- పదోన్నతులకు ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- 300 మందిని పిలిస్తే, 151 మంది విల్లింగ్
- నేడు గ్రేడ్-2 హెచ్‌ఎంలకు అంగీకార పత్రాల సేకరణ



విశాఖ డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు మేలు చేయాలనే తలంపుతో ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, కొంతమంది అయ్యవార్లు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. ప్రమోషన్‌కు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయ అధికారులు అంగీకార పత్రాలను సేకరిస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు)కు ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయంలో శుక్రవారం అంగీకార పత్రాలను తీసుకున్నారు. సీనియార్టీ మేరకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 300 మంది ఉపాధ్యాయులను పిలిచారు. వీరిలో 181 మంది మాత్రమే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకాగా, వీరిలో 151 మంది ఉపాధ్యాయులు మాత్రమే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి తీసుకునేందుకు అంగీకార పత్రాలు ఇచ్చారు. ప్రమోషన్ ఇస్తామన్నా, మాకొద్దంటూ ఉపాధ్యాయులు నిరాసక్తత వ్యక్తం చేయడం గమనార్హం.

మారుమూలలకు వెళ్లటం ఇష్టం లేకనే..

ఉద్యోగులకు ప్రమోషన్ అంటే అదో సంబరమే. పని చేస్తున్న కేడర్ నుంచి మరో కేడర్ పోస్టుకు వెళ్లటంతో పాటు, రెండు ఇంక్రిమెంట్లు మంజూరవుతాయి. దీని వల్ల నెలసరి వేతనంలో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఎంతలేదన్నా, ఒక్కో ఉపాధ్యాయుడికి నెలకు రూ.5 వేలు వరకు వేతనం పెరుగుతుంది. అయితే కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం, ప్రమోషన్ తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఎక్కువగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోనే ఉద్యోగోన్నతి కేడర్‌లో ఖాళీలు ఉన్నట్లు డీఈవో కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి విశాఖ నగరం, దీని చుట్టపక్కల పాఠశాలల్లో తిష్టవేసిన ఉపాధ్యాయులు, ఇక్కడి నుంచి కదిలేందుకు ఇష్టం లేక, ఉద్యోగోన్నతులు సైతం వదులుకుంటున్నారనే ప్రచారం ఉంది.

నేడు స్కూల్ అసిస్టెంట్లకు పిలుపు

గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు 13 ఖాళీగా ఉన్నాయి. వీటిని అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ఇప్పటికే 10 మంది అంగీకార పత్రాలు ఇచ్చారు. కాగా మరో నలుగురు స్కూల్ అసిస్టెంట్‌లను ధ్రువీకరణ పత్రాల పరిశీలన, అంగీకార పత్రాల సేకరణ కోసమని శనివారం డీఈవో కార్యాలయానికి హాజరుకావాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను విడుదల చేశారు.

అంగీకారపత్రాలు సేకరిస్తున్నాం



ఉద్యోగోన్నతుల కోసమని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి అంగీకార పత్రాలను సేకరిస్తున్నాం. సీనియార్టీ జాబితాలో ఉన్నప్పటికీ, కొంతమంది ఉపాధ్యాయు లు ప్రమోషన్ నిరాకరిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– లక్ష్మణరావు, ఇన్‌చార్జి డీఈవో, విశాఖ జిల్లా

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ

- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- టాప్ 50 యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం
- రూ. కోటి 25 లక్షల వరకు ఫీజు చెల్లింపు
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం

ఈ కోర్సులకే అనుమతి..

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్– పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ

విశాఖ విద్య: పేద విద్యార్థుల చదువులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రాథమిక, సెకండరీ స్థాయిలో అమ్మ ఒడి, ఆపై చదువులకు జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలతో అండగా ఉంటోంది. ఇదే క్రమంలో విదేశాల్లో సైతం చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకంలో భాగంగా విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ. కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకే పథకం అందించేలా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, దరఖాస్తుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణ మూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పేద విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

టీడీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది విదేశాల్లో చదువులు పేరిట నిధులు దోపిడీ చేశారు. విదేశాలకు వెళ్లినప్పటికీ, అక్కడ వేరు వేరు పనులు చక్కబెట్టుకోవటం, మరికొంతమంది అయితే విదేశాలకు వెళ్లకుండానే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పథకం పక్కదారి పట్టించారు. దీని వల్ల విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే అర్హులైన వారికి పథకం అందని పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని ప్రక్షాళన చేసింది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికే పథకం వర్తింపజేసేలా విధి విధానాలు రూపొందించింది.

టాప్ 50లోనే చదువులు:–

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్ 50 లో నిలిచిన యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక పరమైన సపోర్ట్ ఇవ్వనుంది. ఆయా కోర్సులకు అవసరమైన విద్యార్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ కోర్సు అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఆలిండియా స్థాయిలో నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. http://jnanabhumi. ap. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.



సామాన్యులు.. విదేశీ విద్యతో అసామాన్యులు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

మునగపాక: ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేసిన ఘటన మండలంలో టి.సిరసపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇక్కడ ఉపాధి పనులు చేసేందుకు పలువురు కూలీలు హాజరయ్యారు. తుప్పలు తొలగించే క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దాంతో పది మంది మహిళా కూలీలు గాయపడ్డారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి చొరవతో వారిని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, చికిత్స అనంతరం సాయంత్రానికి గ్రామానికి చేరుకున్నారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం


బెల్లం పులుపు ధ్వంసం చేస్తున్న పోలీసులు

రావికమతం: రాయవరం శివార్లలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆ గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో గ్రామ శివారు తోటల్లో దాడి చేశామన్నారు. అక్కడ బెల్లం పులుపు, సారా తయారీకి ఉపయోగించే పాత్రలు ధ్వంసం చేశామన్నారు.

గవర పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు

అనకాపల్లి టౌన్: జిల్లాలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గవర నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో వచ్చే నెల 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఐఐటీ, మెడిసిన్, నీట్ ప్రవేశం పొందిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9291445974 సంప్రదించాలన్నారు.

చంద్రబాబుపై గెలిచేది మత్స్యకారుడే

- మత్స్యకారులను అవహేళన చేసినందుకు గుణపాఠం
- టీడీపీకి సమాధి కట్టడం ఖాయం
- రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు
- రూ.1.50 కోట్లతో మినీ ఆంధ్ర ఫిష్ సెంటర్ ప్రారంభం


స్టోరేజ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది (భీమిలి): మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు మత్స్యకారులను తోలు తీస్తానంటూ అవహేళన చేశాడని, రానున్న ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబుపై మత్స్యకారుడే పోటీ చేసి గెలుస్తారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. భీమిలి బీచ్ రోడ్డు నాల్గవ వార్డు చేపల తిమ్మాపురంలో ది విశాఖపట్నం ఫిషర్ ఉమెన్ డ్రై ఫిష్ కోఆపరేటివ్ సొసైటీ సౌజన్యంలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన మినీ ఆంధ్ర ఫిష్ సెంటర్, ఫ్లాట్‌ఫామ్ స్టోరేజ్ రూమ్స్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా..మత్స్యకారుల జీవన విధానం మారలేదని రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన దగ్గర నుంచి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులతో పాటు గుర్తింపు వచ్చిందన్నారు. మత్స్యకారుడ్ని మంత్రిగా చేసిన ఘనత జగనన్నదే అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను రూ. 150 కోట్లతో ఆధునికీకరణ చేస్తున్నామని, పూడిమడకలో రూ. 360 కోట్లతో నూతన హార్బర్‌ను రానున్న రోజుల్లో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. రాజయ్యపేటలో జెట్టీని, భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో కాకినాడ ఉప్పాడలో హార్బర్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వేట విరామ సమయంలో రూ.10వేల మత్స్యకారులకు అందిస్తున్నామని చెప్పారు. అదే విధంగా మత్స్యకారుల స్థాయిని పెంచే విధంగా ఎక్కడికక్కడ ఫిషర్ ఆంధ్ర సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో 70 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు పడవలు అందించబోతున్నామన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఫిష్ డ్రైయింగ్ మెషన్లను మత్స్యకారులకు అందుబాటులోనికి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ ఉన్న చంద్రబాబు ఏనాడైనా మత్స్యకారులకు మేలు చేసే కార్యక్రమం చేశారా అని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మత్స్యకారుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని, ఆయన హయాంలో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులు చంద్రబాబుకు తోలు తీసి, బుద్ధిచెప్పి ఇంటికి పంపిస్తారని తెలిపారు.

చంద్రబాబుకు సమాధి కడతాం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు అవహేళన చేసి సమాధులకు కూడా పనికిరావని విమర్శించాడని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి పేదలే సమాధి కడతారని అప్పలరాజు పేర్కొన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తున్నా టీడీపీ అడ్డుకుంటోందన్నారు. రానున్న కాలంలో విశాఖ రాజధానిగా మారడం ఖాయమని, విశాఖ నుంచి భోగాపురం వరకు ఆరు లైన్ల రోడ్డు నిర్మించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గతంలో తిమ్మాపురంలో మత్స్యకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కోర్టు కేసుల నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని ఇక్కడ మత్స్యకారులు మంత్రి సీదిరి అప్పలరాజును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, జేసీ విశ్వనాథన్, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, సొసైటీ అధ్యక్షులు మారుపల్లి పార్వతమ్మ, స్థానిక నాయకులు మారుపల్లి అమర్‌నాథ్, వాసుపల్లి నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 30న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట(విశాఖ): విశాఖ సెంట్రల్ జైలులో పాడేరుకు చెందిన రిమాండ్ ఖైదీ కొర్ర వెంకట రమణ మృతిపై ఈనెల 30న మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు విశాఖ ఆర్డీవో హుస్సేన్ తెలిపారు. గత ఏప్రిల్ 16న అనారోగ్యానికి గురైన వెంకటరమణను కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడని ఆయన పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. వెంకటరమణకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసి ఉంటే మెజిస్టీరియల్ విచారణలో తెలియజేయాలని ఆయన కోరారు.

బదిలీలకు దరఖాస్తుల వెల్లువ

- ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికనే బదిలీలు
- 6 వేలకు పైగా దరఖాస్తులు, శరవేగంగా పరిశీలన

విశాఖ విద్య: విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే శుక్రవారం సాయంత్రానికే 6 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. జీరో సర్వీసుతో బదిలీకి అవకాశం కల్పించటంతో అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువగా దరఖాస్తులు వస్తాన్నాయి. ఇదిలా ఉంటే బదిలీ కోసమని వచ్చిన దరఖాస్తుల వాస్తవికతను నిర్ధారించేందుకు పరిశీలన ప్రక్రియ కూడా శరవేగంగా సాగుతోంది. 27 నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిని వేగవంతం చేశారు. ఎస్జీటీలకు ఎంఈవో స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ డీఈవో, హెచ్‌ఎంలకు ఆర్జేడీ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని ధ్రువీకరిస్తున్నారు. ఒకే చోట 8 ఏళ్లకు పైబడిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఐదేళ్లకు పైబడిన హెచ్‌ఎంలు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. దీంతో ఖాళీల జాబితాలను ప్రదర్శించేందుకు డీఈవో జి. లక్ష్మణరావు నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్

ఉపాధ్యాయులు బదిలీల్లో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సకాలంలో పరిష్కరించేలా డీఈవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్ ఫర్ జీవో గైడ్ లెన్స్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ హెచ్‌ఎస్ అనంతవరం, అగనంపూడి హెచ్‌ఎంలు కృష్ణకుమార్, కృష్ణారావును నియమించారు. ఆన్‌లైన్ దరఖాస్తులో తలెత్తే సాంకేతిక సమస్యల పరిష్కారంకు డీఈవో కార్యాలయ ఏఎస్‌వో జీ. సుబ్రహ్మణ్యం, అరకు ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న జి. సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించారు. బదిలీలకు సంబంధించిన ఫిర్యాదులపై డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కే. పల్లవికు బాధ్యతలు అప్పగించారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీరు పనిచేస్తారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు


డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

మాడుగుల రూరల్: మండలంలో కింతలి గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు టీడీపీని వీడి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. కె.జె.పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కింతలి ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సుంకర దేవి, ఆమె భర్త శ్రీనివాసరావు, సలాది వెంకటశివ, సలాది రమేశ్, సుంకర మహలక్ష్మినాయుడు, కిల్లాడ సత్తిబాబుల కుటుంబాలు కలిశాయి. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ కింతలి గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న, మాజీ సర్పంచ్ మైచర్ల సత్యంనాయుడు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో బావిశెట్టి వారి కళ్లాల రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన గంట్రెడ్డి ఈశ్వరరావు శుక్రవారం పెద్దేరు నదిలో నుంచి తన టైర్ బండి ద్వారా ఇసుకను వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరు దగ్గర తడి ఉండటంతో విద్యుత్ సరఫరా అయింది. అయితే ఎద్దు కాలి గిట్టలకు అడుగు బాగాన వేసిన ఇనుప నాడిలకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే నేలపై పడి మృతి చెందింది. రైతు ఈశ్వరరావు త్రుటిలో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. రూ.50 వేలు విలువ గల ఎద్దు మృతి చెందిందని వాపోయాడు. విద్యుత్ శాఖ ఏఈ రాజు, పశు వైద్యాధికారి శివకుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.

ఎస్‌బీఐ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడు సతీష్‌తో ఎస్‌ఐ దీనబంధు

రాంబిల్లి: స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో చోరీకి యత్నించిన కేసులో నిందితుడు కడింపల్లి సతీష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ దీనబంధు శుక్రవారం తెలిపారు. ఈ నెల 7న రాత్రి ఎస్‌బీఐలోకి ప్రవేశించి లాకర్ రూం తెరిచేందుకు ప్రయత్నించగా, సైరన్ మోగడంతో చుట్టుపక్కల వారు నిద్రలేచి తమకు సమాచారం ఇచ్చారన్నారు. దాంతో దొంగ పరారయ్యాడన్నారు. ఎటువంటి నగదు, వస్తువులు చోరీ చేయలేదన్నారు. ఈ దొంగతనానికి పాల్పడిన రాంబిల్లి మండలం వై.లోవ గ్రామానికి చెందిన సతీష్‌ను అరెస్ట్ చేసి యలమంచిలి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన తమ సిబ్బందిని ఎస్‌ఐ అభినందించారు.

పడవ బోల్తా- మత్స్యకారుడి మృతి


మృతి చెందిన శీరం అప్పారావు

భీమునిపట్నం: భీమిలి తీరంలో శుక్రవారం పడవ బోల్తాపడిన ఘటనలో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఎగువపేటకు చెందిన శీరం అప్పారావు (77) తోటి మత్స్యకారులతో కలిసి శుక్రవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో సముద్రంపైకి చేపలవేటకు వెళ్లాడు. తిరిగి వీరందరూ ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో లైట్‌హౌస్ సమీపంలోని తీరానికి వస్తున్నారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పడవ ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అప్పారావు అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోయాడు. ఆయతోపాటు ఉన్న గరికిన ఎల్లాజి, పీరుపల్లి రాజు, జీ.ఎల్లాజీ, పీరుపల్లి నూకరాజు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 359 మంది గైర్హాజరు

అనకాపల్లి టౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం జిల్లాలో 359 మంది గైర్హాజరయ్యారని డీవీఈవో బి.సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 6758 మంది విద్యార్థులకు 6399 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మేథ్స్, బోటనీ, సోషల్, ఒకేషనల్ విద్యలో పరీక్షలు జరిగాయి.

యువకుడిని రక్షించిన మెరైన్ పోలీసులు


నాగేష్‌నాయుడుతో మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం తీరంలో స్నానానికి దిగిన యువకుడు మునిగిపోతుండగా, మెరైన్ పోలీసులు రక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన బద్ది నాగేష్‌నాయుడు తన స్నేహితులతో కలిసి శుక్రవారం తీరానికి వచ్చారు. ఇరువురు ఒడ్డున ఉండగా, నాగేష్‌నాయుడు స్నానం కోసం సముద్రంలోకి దిగాడు. ఇంతలో పెద్ద కెరటం వచ్చి లాక్కొని పోవడంతో ఒడ్డున ఉన్న స్నేహితులు గావుకేకలు వేశారు. వెంటనే సమీపంలో మెరైన్ పోలీసులు చినబాబు, జగన్నాథం, శివ సముద్రంలోకి దిగి అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారికి స్నేహితులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే మరలా జగన్‌ను గెలిపిస్తాయి

- ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీల జిమ్మికులు
- రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ జోగినాయుడు


ఎమ్మెల్యే గణేష్‌తో జోగినాయుడు

నాతవరం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, మరలా రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ఎదురు చూస్తున్నారని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ (సినీనటుడు) జోగినాయుడు స్పష్టం చేశారు. ఆయన పదవి చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను వల్సంపేటలో శుక్రవారం గడప గడపకు కార్యక్రమంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ మహానేత రాజశేఖర్‌రెడ్డి ఒక అడుగు వేస్తే, తనయుడు జగన్ మోహన్‌రెడ్డి ప్రజల కోసం రెండడుగులు ముందుకేసి చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమం, అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. వీటిని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీల నేతలు రోజుకొక పగటి వేషంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత పాలనలో జన్మభూమి కమిటీల ఆమోదం మేరకు సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారని ప్రశంసించారు. సినీ పరిశ్రమలో పెద్దలు సైతం జగన్ పాలనను చూసి హర్షిస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల పాల్గొన్నారు.


బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

- పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుకర్


మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుకర్, రాష్ట్ర కార్యదర్శి పీవీఎన్ మాధవ్

చోడవరం: గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నూకాల మధుకర్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం చోడవరంలో జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులతోపాటు అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలు నియమించే బాధ్యత జిల్లా కమిటీ పూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రధాన నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. వీటిలో జిల్లాలో ఉద్యానవన పరిశోధనా కేంద్రాన్ని, బుచ్చెయ్యపేటలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని, చక్కెర కర్మాగారాలను తిరిగి తెరవాలని, తదితరవి ఉన్నాయి. విశాఖపట్నానికి వందేభారత్ రైలును కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్లో నాలుగు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర ప్రతినిధులు పొన్నగంటి అప్పారావు, జిల్లా ఇన్‌చార్జి మాలకొండయ్య, పుట్టా గంగయ్య, జోనల్ ఇన్‌చార్జి సూర్యనారాయణరాజు, ఈర్లె శ్రీరామ్మూర్తి, అమర్, దేవరపల్లి చంటి, భక్తసాయిరాం పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ సమస్యలపై అలసత్వం తగదు


షిప్‌యార్డ్ యాజమాన్యంతో చర్చిస్తున్న విక్టర్ ప్రసాద్, ఇతర ఉద్యోగులు

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

సింధియా : షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సమస్యల పరిష్కారంపై అలసత్వం తగదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌కు వచ్చిన ఆయన ఉదయం షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద విలేకర్లతో మాట్లాడారు. అనంతరం షిప్‌యార్డ్ సమావేశ మందిరంలో పలువురు షిప్‌యార్డ్ యాజమాన్యంతోనూ, ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లతోనూ, పలువురు కార్మిక, సామాజిక సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రితో పలు కార్మిక సమస్యలపై వివరణ కోరారు. షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న దళిత ఉద్యోగిపై సంస్థ డైరెక్టర్ కార్పొరేట్ ప్లానింగ్ అధికారి అనుచిత ప్రవర్తనపై ప్రశ్నించారు. అందుకు తగిన సమాధానం రాకపోవడంతో సంబంధిత అధికారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అక్కడే ఉన్న హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్‌ను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పరిశ్రమ ఆవరణలో ఉంటే యాజమాన్యానికి ఏంటి అభ్యంతరమని ప్రశ్నించారు. ఎల్ సిరీస్ కార్మికుల్లో మిగిలిన 16 మందిలో ఎస్సీ, ఎస్టీకి చెందిన నలుగురు కార్మికులను కంపెనీ రోల్‌లోకి తీసుకోవాలని, వర్క్ టు స్టాఫ్, స్టాఫ్ టు ఆఫీసర్, ఆఫీసర్ టు ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని కోరారు. సిరీస్‌లో ఉన్న 300 మంది ఎస్సీ, ఎస్టీ కేటగిరి కార్మికులకు పర్మినెంట్ చేయాలని కోరారు. దీనికి సమాధానంగా సీఎండీ మాట్లాడుతూ పర్మినెంట్ చేయడం అనేది కేంద్రప్రభుత్వ పరిధిలోనిదని, తమ పరిధిలో ఉండదన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గత సీఎండీ శరత్‌బాబు సూచించిన డాల్ఫిన్ జెట్టి ప్రాంతాన్ని సందర్శించి అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం షిప్‌యార్డ్ కాలనీలోని బాలకృష్ణ కల్యాణమండపంలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులతో సమావేశమై జాతి అభివృద్ధికి కృషి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు అప్పలకొండ, కార్యదర్శి అనిల్‌కుమార్, పలు కార్మిక సంఘాల ప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్: గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక నరసింగరావుపేట(రామచంద్రా థియేటర్ జంక్షన్)లో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

‘డైట్’విద్యార్థుల ప్రతిభ



పరికరంతో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: ప్రకృతి నుంచి లభించే గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాన్ని స్థానిక ‘డైట్’ కళాశాలడిప్లమో తృతీయ సంవత్సరం విద్యార్థులు తయారు చేశారు. ఆ పరికరాన్ని తయారు చేసిన విద్యార్థులు జి.సాయి, ప్రియ, కె.చందులను కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం శుక్రవారంఅభినందించారు. ఈ పరికరం ద్వారా ఎలా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చో విద్యార్థులు విశదీకరించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లిటౌన్: ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల యూనియన్ నాయకులు కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అనకాపల్లి డిపోగేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి పరమేశ్వరరావు మాట్లాడుతూ బదిలీలను పారదర్శకంగా చేయాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో ఆర్టీసీ వైద్యాన్ని పునరుద్ధరించాలని, కొత్తబస్సులు కొనుగోలు చేయాలని, దశల వారీగా అద్దెబస్సుల స్థానంలో ఆర్టీసీ సొంత బస్సులను ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తూటిపాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో శుక్రవారం ఉదయం దాడి చేశామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 187 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	4,400
రెండో రకం	3,950	4,310
మూడో రకం	3,880	4,000

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	- రాజా
రామభాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
2018	-షిర్డిసాయి
ఉగ్రం	-పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	-వెంకటేశ్వర
మళ్లీపెళ్లి	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 18 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-8 యూనిట్లు, ఒ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 456 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- జూలై 1 నుంచి అందజేత
- నెలలో రెండు విడతలుగా పంపిణీ
- ఎక్కువ మంది కేంద్రాలకు రాకపోవడంతో నిర్ణయం



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం తీసుకుంటున్న గర్భిణులు,బాలింతలు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

అనకాపల్లి రూరల్:అంగన్‌వాడీ కేంద్రాలు బాలింతలు,గర్భిణులు,చిన్నారుల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తూ కార్యకర్తలు తగిన సూచనలు ఇస్తుంటారు. బాలింతలు,గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేందుకు సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా పోషకాహారాన్ని అందిస్తున్నారు. కేంద్రాలు దూరంగా ఉండటం,అనారోగ్యం తదితర కారణాలతో ఆహారం తీసుకోవడానికి ఎక్కువ మంది కేంద్రాలకు రావడంలేదు.ఈ నేపథ్యంలో పోషకాహారాన్ని కేంద్రాల్లో తీసుకుంటారా? ఇంటికి తీసుకెళ్తారా? లేదా సరకులు ఇంటికే ఇవ్వమంటారా? అని గత నెలలో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.అధిక శాతం మంది ఇంటికే సరుకులు ఇవ్వాలని కోరడంతో లబ్ధిదారులకు ఇంటికే సరుకులు అందించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

- జూలై 1 నుంచి దీనిని అమలుచేసేందుకు చర్యలు చేపడుతున్నారు.కోవిడ్ సమయంలో రెండేళ్లపాటు టేక్ హోమ్ రేషన్ పేరుతో సరకులు లబ్ధిదారుల ఇళ్లకే అందించారు. అనంతరం ప్రభుత్వం గత ఏడాది జూన్ ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలలోనే లబ్ధిదారులకు వేడిగా పోషకాహారం వండి పెడుతున్నారు. ఈ విధానానికి పూర్తి స్థాయిలో లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు.ఆరోగ్య సమస్యలు,చిన్నారుల సంరక్షణ, నెలలు నిండిన గర్భిణులు కేంద్రాలకు రాలేకపోవడంతో అలాంటి వారికి భోజనం ఇంటికి తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పించారు.తాజాగా చేపట్టిన అభిప్రాయ సేకరణలో ఎక్కువమంది సరకులు ఇంటికే ఇవ్వాలని కోరుకున్నారు. నెలలో రెండు విడతలుగా సరకులను ఇంటికే ఇవ్వాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సంపూర్ణ పోషణ కిట్‌లో నెలకు ఇచ్చే సరకులు

సరకులు	పరిమాణం
అటుకులు	కిలో
రాగి పిండి	కిలో
జొన్న పిండి	కిలో
కంది పప్పు	కిలో
బియ్యం	3 కిలోలు
బెల్లం	250 గ్రాములు
చిక్కీలు	250 గ్రాములు
ఎండు ఖర్జూరం	250 గ్రాములు
నూనె	500 గ్రాములు
గుడ్లు	25
పాలు	5 లీటర్లు

అనకాపల్లి ప్రాజెక్ట్ పరిధిలో ఇలా...

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	:234
బాలింతలు	:1,271
గర్భిణులు	:1,402
3-7 ఏళ్ల మధ్య వయసు చిన్నారులు	:7033

ఇప్పటికే 3 నుంచి 7 ఏళ్లలోపు చిన్నారులకు ఇంటికే పోషకాహారం ఇస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల మహిళలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పటిష్టంగా అమలు చేస్తున్నాం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రాజెక్టు పరిధిలో పటిష్టంగా అమలు చేస్తున్నాం.మా పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు,బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా రక్తహీనతను నివారిస్తున్నాం.జూలై ఒకటి నుంచి పౌష్టికాహారం ఇళ్లకే అందిస్తాం. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి. ప్రభావతి,సీడీపీవో,అనకాపల్లి ప్రాజెక్టు

సంక్షేమ వారధులు వలంటీర్లు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సామాజిక భవన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అమర్‌నాథ్

కశింకోట: గ్రామ వలంటీర్లు ప్రజలకు సంపూర్ణంగా సేవలందించి ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకురావడానికి కృషిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 90 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు అందజేసి, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, గ్రామ వలంటీర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా స్థానిక వారపు సంత నిర్వహించే ప్రాంతంలో అరబిందో ఫార్మా పరిశ్రమ ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణ ప్రాంతాన్ని, మార్కింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు యల్లపు వరలక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. మండలంలో జాతీయ రహదారి ఎంఎంఏఎల్ జంక్షన్ వద్ద 150 మంది ద్విచక్రవాహనదారులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న పిల్లలకు మాత్రమే వాహనాలు ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఈచలనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్, వాహనదారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

కోటవురట్ల: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు తహసీల్దారు జానకమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం వరాహనదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ఎడ్ల బళ్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కై లాసపట్నం రెవెన్యూ పరిధిలో ఇసుక అక్రమ రవాణా నిత్యం జరుగుతోందని తెలిపారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. పి.కె.పల్లి గ్రామంలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి స్టాక్ తనిఖీ చేశారు. ఫిర్యాదులు లేకుండా కేంద్రాలను నడపాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సంపూర్ణ పోషణను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు.

రాష్ట్ర అభివృద్ధే సీఎం ధ్యేయం

- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వెదురుపర్తిలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో రెండో రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అడుగడుగునా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై రూపొందించిన కర పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపే ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. కుల, మత, పార్టీ రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో ఏ మంత్రి, ఎమ్మెల్యే అయినా వారు చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చెప్పుకోగలిగారా? అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తుండడంతో ప్రజల మధ్య తాము తిరగగలుగుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోందని చెప్పారు. వాటితో అవసరమైనచోట సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్టు చెప్పారు.

దీనురాలికి అండగా ...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో కాండ్రకోట భార్గవి అనే యువతి తన ఆరోగ్యం , కుటుంబ దీన పరిస్థితి గురించి మంత్రికి వివరించి కన్నీళ్ల పర్యంతమైంది. తనకు ఏడో ఏట నుంచి చక్కెర వ్యాధి ఉండటం వల్ల నిత్యం మందులు వేసుకోవలసిన పరిస్థితి వచ్చిందని, ఇందుకు ప్రతి నెలా ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయింది. తన తండ్రి ఏడాది క్రితం మృతి చెందారని, తల్లి వృద్ధాప్యంలో ఉండటం, ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో తన భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో మంత్రి అమర్‌నాథ్ చలించిపోయారు. అనకాపల్లి కళాశాలలో డిగ్రీ చదువుతున్న భార్గవికి విద్యా దీవెన పథకం కూడా అందలేదని తెలుసుకొని ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. వైద్య ఖర్చులు సమకూర్చడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, స్థానిక ప్రతినిధులు ఆళ్ల జగదీశ్వరరావు, అల్లవరపు నాగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘డైట్’లో ముగిసిన క్రీడా పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

తుమ్మపాల: పలు క్రీడా పోటీల్లో ‘డైట్’విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నరసింహం తెలిపారు. కళాశాలలో మే 11 నుంచి 25 వరకు ఇండోర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చెర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ చల్లా నరసింహం శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. బాలురు విభాగంలో టెబుల్ టెన్నిస్‌లో సీఎస్ఎం విద్యార్థులు విన్నర్స్‌గా, సీఎస్‌డీ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. చెస్ పోటీల్లో సీఎస్‌డీ విద్యార్థులు విన్నర్స్‌గా, సీఎస్ఎం విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. క్యారమ్స్‌లో విన్నర్స్‌గా ఈఈఈ విద్యార్థులు, రన్నర్స్‌గా సీఎస్‌ఈ విద్యార్థులు గెలుపొందారు. బాలికల విభాగంలో టెబుల్ టెన్నిస్‌లో సీఎస్ఎం విద్యార్థులు విన్నర్స్‌గా, సీఎస్‌ఈ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు, చెస్‌లో ఈసీఈ విద్యార్థులు విన్నర్స్‌గా, ఈఈఈ విద్యార్థులు రన్నర్స్‌గా, క్యారమ్స్‌లో విన్నర్స్‌గా సీఎస్ఎం విద్యార్థులు విన్నర్స్‌గా, సీఎస్‌ఈ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు, అధ్యాపకులు కె.ఈశ్వరరావు, కృష్ణనాగ్, పీడీ బి.శ్రీనివాసరావు, హెచ్‌వోడీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

మంత్రి గుడివాడను విమర్శిస్తే సహించం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కనకారావు



మాట్లాడుతున్న కనకారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్: మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వద్ద టీడీపీ, జనసేన నాయకులు చాలా నేర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సమ్మంగి కనకారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వద్దగల పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు అనవసరంగా అసభ్య పదజాలంతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కశింకోట మండలం విస్సన్నపేట భూ వివాదాన్ని తెరపైకి తీసుకొస్తూ పదే పదే విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అక్కడ సెంటు స్థలం కూడా అమర్‌నాథ్‌కు లేదని అధికారులు వెల్లడించినా టీడీపీ, జనసేన నాయకులు మంత్రి అమర్‌నాథ్ ఎదుగుదలను ఓర్వలేకనే బురదజల్లేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ప్యాకేజీ కోసం జనసేన నేతలు మాట్లాడడం సరికాదన్నారు. ప్యాకేజీ ఎవరిస్తే అటు వైపు మాట్లాడడం జనసేన నాయకులు అలవాటుగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కటారి మహేష్, సహాయ కార్యదర్శి ఈదలపాక శివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు బెల్లాన అనూరాధ, పట్టణ బీసీ సెల్ కార్యదర్శి పి.కల్యాణ్, ఉపాధ్యక్షుడు కోన ఉమ పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు



క్షయ రోగులకు కిట్లు అందజేస్తున్న డీఎల్‌ఏటీవో శారదాబాయి

అనకాపల్లి రూరల్:ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 18 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు.టీబీని పూర్తిగా నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రకారం టీబీ రోగుల్లో రోగ నిరోధకశక్తి పెరగడానికి పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నట్టు డీఎల్‌ఏటీవో శారదాబాయి చెప్పారు. క్షయ రోగులంతా క్రమం తప్పకుండా ఔషధాలు,పోషకాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు.పోలియో వలే టీబీని పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ వైద్య ఆరోగ్యశాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి బి.మంజూష, ఎంపీహెచ్‌ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్‌లు బి.సంగం,ఎం. మాణిక్యాంబిక, ఎస్‌టీఎల్ ఎం.పెంటయ్య,బి.సత్యసుధ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాకలో శుక్రవారం కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 29న అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందించడం లేదన్నారు. రానున్న రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నేత ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాలో శిక్షణ



విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న శ్రీనివాసరాజు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యోగా గురువు ఎ.శ్రీనివాసరాజు స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు భగవద్గీత, భారతం, రామాయణంలలో శ్లోకాలు నేరిస్తున్నారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు.

కోటవురట్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి అప్పలనాయుడు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనంతో పాటు నీతి కథలు చెప్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ సూకరాజు

మునగపాక: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల సూకరాజు తెలిపారు.శుక్రవారం వాడ్రాపల్లి సచివాలయంలో ఉద్యోగులు,గ్రామపెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రాయితీపై విత్తనాలు

మునగపాక: తోటాడ ఆర్‌బీకేలో శుక్రవారం రైతులకు సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలందుతున్నాయని చెప్పారు.